# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JANUARY - 2004

## HEAR THE VOICE OF TRUTH ON RADIO SRILANKA

| | | |
|---|---|---|
| TELUGU | : | Sunday, Monday, Wednesday & Thursday, 2:00 P.M.-2:15 P.M. |
| T.V. | : | Every Saturday 6:30 A.M. on Teja Channel & Every Tuesday 6:30 A.M. MAA - Channel. *Speaker : Joshua Gootam,* P.O.Box-80, Kakinada - 533 001. |
| HINDI | : | Sunday 6:45 p.m. 7:00 p.m. and Thursday, 6:45 p.m. 7:00 p.m. Speaker, *Sunny David*, P.O.Box 3815, New Delhi - 110 049. |
| Tv | : | Every Sunday at 6:00 A.M. - ETC Channel |
| TAMIL | : | Monday, Tuesday, Wednesday, Thursday, Friday 5:30 p.m. to 5:45 p.m. Speaker : *P.R.Swamy,* P.O. Box-8405, Bangalore-560084. |
| MALAYALAM | : | Friday, 3:45 p.m. 4:00 p.m. Speaker : *P.K.Varghese,* P.O. Box - 5540 Trivendrum - 695043 (Kerala). |
| PAITE | : | Sunday 8:00 p.m. Speaker, *Kamlianpao,* P.O.Box-56, Churachandpur, Manipur-795128. |

Please write to these addresses for Bible correspondence courses, magazines, and other Christian literature in your language.

ALL OF THESE PROGRAMMES ARE SPONSORED BY CHURCHES OF CHRIST.

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — జనవరి 2004 — సంచిక 6


## క్రైస్తవ యుగము

(CHRISTIAN AGE)

యేసుక్రీస్తు యొక్క సిలువ యొద్ద యూదుల యుగము అంతమాయెనని గత పాఠములో మనము నేర్చుకొన్నాము. ఆయన సిలువ ద్వారా మోషే ధర్మ శాస్త్రము నంతయు నెరవేర్చి దాని ప్రయోజనము నిక లేకుండ చేసెను. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తి వేసి మన అపరాధముల నన్నిటిని క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింప జేసెను" అని కొలస్స 2:14లో పౌలు వ్రాసెను.

పాత నిబంధన లేక మోషే ధర్మ శాస్త్రము అమలులో నున్న కాలమందు యేసుక్రీస్తు జన్మించెను. ఆయన యూదుడై యుండి ఆ ధర్మశాస్త్రమునకు పరిపూర్ణ ముగ లోబడెను (గలతీ 4:4). మానవులలో ఆయన ఒక్కడు మాత్రమే ధర్మశాస్త్రమును

పరిపూర్ణముగ నెరవేర్చ గల్గిన వాడాయెను. నేను ధర్మశాస్త్రమును నెరవేర్చుటకే వచ్చితిని గాని కొట్టివేయుటకు రాలేదు. ఆకాశమును భూమియు గతించి పోయి ననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైె నను తప్పి పోదని ఆయన బోధించెను (మత్తయి 5:17, 18). ఆయన కప్పగించబడిన పనిని యేసుక్రీస్తు సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద తండ్రియైన దేవుని మహిమ పరచెను (యోహాను 17:4). అందువలన మోషే ధర్మశాస్త్రము కొట్టి వేయబడుట ద్వారా కాదుగాని నెరవేర్చ బడుట ద్వారా ఎత్తి వేయబడుట మనము చూడగలము.

ధర్మశాస్త్రమును నాశనము చేయ కుండ నెరవేర్చుట ద్వారా యేసుక్రీస్తు దానినెట్లు ఎత్తివేసెనో కొంతమంది ఇంకను అర్థము చేసుకొనలేక పోవుచున్నారు. అయితే దానిని యేసుక్రీస్తు ఎట్లు సాధించెనో ఒక ఉదాహరణ ద్వారా గమనించుదాం. మీ ఊరిలో రోడ్డుపై ఒక వంతెన కట్టుటకు ఒకనికి కాంట్రాక్టు ఇచ్చారనుకుందాం. ఆ కాంట్రాక్టును అతడు రెండు విధములుగ కొట్టివేయవచ్చును. అతడు మీరు వ్రాసిన కాంట్రాక్టును ముక్క ముక్కలుగా చింపివేసి నాశనము చేయవచ్చును లేదా అందున్న షరతులనుబట్టి ఆ వంతెనను నిర్మించి, కాంట్రాక్టును సంపూర్తిగ నెరవేర్చవచ్చును. అతడు పనిని పూర్తి చేయగానే పూర్వము వ్రాయబడిన షరతుల యొక్క ప్రయోజనము ఇక లేక పోవును గదా. అట్లే యేసుక్రీస్తు కూడ ధర్మశాస్త్రమునందలి షరతులను సంపూర్తిగ నెరవేర్చి దానిని ఎత్తివేసెను. మోషే ధర్మ శాస్త్రము ఇప్పుడు అమలులో యున్నదా లేదా యనునది ప్రశ్నకాదు. నిజానికి అది ఎట్లు కొట్టివేయబడెను? యేసుక్రీస్తు పరిపూర్ణముగ దాని నవలంబించెను. అట్లు చేసి ఆయన ధర్మశాస్త్రమును సమాప్తి చేసెను. ఆయన సిలువ వేయబడినప్పుడు, పాతనిబంధన కూడ సిలువకు మేకులతో కొట్టబడెను. అట్లు చేయుట ద్వారా క్రొత్తనిబంధన అమలులోనికి వచ్చెను.

యేసుక్రీస్తు పాతనిబంధనకు విధేయత చూపుచు జీవించుచుండినను, అతి త్వరలో రాబోవు క్రొత్త నిబంధన సూత్రములను, షరతులను ఆయన ప్రకటించుచునే యుండెను. యేసుక్రీస్తు భూమిపై జీవించుచుండగా క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చుటకు వీలు లేకపోయెను. "ఏలయనగా మరణశాసన మెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసినవాని మరణము ఆవశ్యకము. ఆ శాసనమును వ్రాసినవాడు

మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనా చెల్లునా"? (హెబ్రీ 9:16, 17). అందువలన మొదటి నిబంధన అమలులో యుండగా రెండవది అమలులోనికి వచ్చుటకు వీలు లేకపోయెను.

క్రీస్తు ధర్మశాస్త్రము అమలులోనికి వచ్చు నిమిత్తము మోషే ధర్మశాస్త్రము సిలువ యొద్ద అంతమొందుట అత్యవసరము. అయితే దేవుడు ఇశ్రాయేలుతో చేసిన పాతనిబంధనను నాశనము చేయుట ద్వారా గాక తన కుమారుని శరీరము ద్వారా దానిని నెరవేర్చి దానినెత్తివేసెను. పాత నిబంధన నిరర్ధకమయిన వెంటనే క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చెను. యూదుల యుగము అంతమవుటతోడనే క్రైస్తవ యుగమారంభమాయెను.

యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకోస్తు అను పండుగ దినమున సువార్తను బోధించుశక్తిని అపొస్తలులకిచ్చు నిమిత్తము పరిశుద్ధాత్మని దేవుడు పంపెను. ఆ దినముననే క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చెను. ఆ దినము నుండి పాత నిబంధన అమలులో నుండకుండ అదృశ్యమాయెను (హెబ్రీ 8:13). ఇది వరకు పాత నిబంధనను అనుసరించుచున్న యూదులు దానిని విడిచి క్రొత్త నిబంధన ప్రకారము నడచుకొనవలసి వచ్చెను. దేవాలయపు ఆరాధన తొలగిపోయి, ఆత్మతోను, సత్యముతోను జరుగు సత్యారాధన అమలులోనికి వచ్చెను (యోహాను 4:20, 24). ధూపదీపములు నైవేద్యములు, రక్తబలులు, దహనబలులు మొదలగువాటి ప్రయోజనమిక లేకపోయెను. ఏలయనగా పరిపూర్ణ బలియాగముగా దేవుడే తన కుమారుని బలియిచ్చెను (హెబ్రీ 10:4).

మోషే ధర్మశాస్త్ర ప్రకారము దూరము చేయబడిన అన్యజనులు అనగా యూదులు కాని వారందరు క్రొత్త నిబంధనలో చేర్చబడిరి. ఆ కాలమందు ఇశ్రాయేలులతో సహపౌరులు కాక పరదేశులును, పరజనులును నిరీక్షణ లేని వారుగను అన్యజనులుండిరి. అయితే ఇప్పుడు క్రీస్తు యూదులకును అన్యజనులకును సమాధానమై యుండి వారిద్దరి మధ్య నున్న గోడను అనగా మోషే ధర్మశాస్త్రమును పడగొట్టి ఉభయులను ఏకము చేసెను. ఇట్లు సంధిచేయుచు వారిద్దరిని తనయందు నూతన పురుషునిగా సృష్టించి, వారిని ఏకశరీరముగా క్రీస్తు చేసెను (ఎఫెసీ 2:12-17). అందువలన ఎవరును ఇకమీదట పరజనులును, పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏకపట్టణస్థులును,

దేవుని యింటివారునై యున్నారు (2:19). యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు..... ఇందులో యూదుడని, గ్రీసు దేశస్థుడని, దాసుడని, స్వతంత్రుడని లేదు. పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తు నందు మీరందరు ఏకముగా ఉన్నారు" అని పౌలు వ్రాసెను (గలతీ 3:26-28).

గత కొద్ది పాఠములలోను బైబిలును బట్టి మానవ చరిత్రను మూడు యుగములుగ విభజించితిమి. మొదటియుగమగు గోత్రకర్తల కాలములో దేవుడు వేర్వేరు వ్యక్తులకును కుటుంబ యజమానులకును తన చిత్తమును బయలుపరచెను. ఆదామున కిచ్చిన ఆజ్ఞను నోవహునకు గాని, అబ్రహాము నకుగాని, లేదా మరెవరికి గాని ఆయన ఇయ్యలేదు. ఆజ్ఞాపింపబడిన గోత్రకర్త మరణించగా ఆ యాజ్ఞ అతనితో అంతమొందెను, అయితే మోషే యుగములో నున్న ధర్మశాస్త్రము సంగతి యేమిటి? గోత్రకర్తల నాజ్ఞాపించిన దానిని దేనిని యూదులకు దేవుడాజ్ఞాపించ లేదు. యూదుల యుగములో ఆజ్ఞాపించిన ఆజ్ఞలలో దేనిని కూడ క్రైస్తవ యుగ ములో ఈనాడు దేవుడు ఆజ్ఞాపించుట లేదు. మోషే ధర్మశాస్త్రము నందు పది ఆజ్ఞలు ఇమడ్చబడియున్నవి. గనుక, పాతనిబంధన గతించిపోయినను పది ఆజ్ఞలు ఇంకనూ అమలులో యున్నవని అనేకులు బోధించుచూ యున్నారు. అట్లు కానియెడల క్రైస్తవుల కున్న నైతిక చట్టమేది? యని యనేకులు ప్రశ్నించెదరు. అయితే రాబోవు సంచికలలో దేవుడు పది ఆజ్ఞలకంటె శ్రేష్టమైన చట్ట మును క్రీస్తు ద్వారా మనకిచ్చినట్లు చూచుకొందాము.

ప్రస్తుతానికి మనము గమనించవలసినదేమిటంటే మోషే ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఈయబడెను. మీకింకనూ అనుమానము ఉన్నయెడల ద్వితీయోపదేశకాండము 5:1-3లను దయచేసి చదవండి. మీరు, నేను యూదులము కాముకనుక అది మనకు వర్తించదు. సరిగద యేసు క్రీస్తు సిలువ యొద్ద అది సర్వసంపూర్తిగ నెరవేర్చ బడెను. దానిలోని ఏ భాగము కూడ క్రొత్త నిబంధనలో, అనగా క్రీస్తు యుగములో కొనసాగింపబడుటలేదు. ఏలయనగా యేసు క్రీస్తు దాని నంతటిని సిలువకు మేకులతో కొట్టివేసెను.

గోత్రకర్తల యుగము ఆదాము నుండి మోషే వరకు 2500 సంవత్సరములు అమలులో యుండెను. యూదుల యుగము మోషేతో సీనాయి పర్వతము వద్ద ఆరంభమై యేసు క్రీస్తు సిలువ యొద్ద అంతమొందెను.

అది 1500 సంవత్సరములు అమలులో నుండెను. క్రైస్తవయుగము యేసుక్రీస్తు సిలువయొద్ద ఆరంభమై నేటకి 2003 సంవత్సరము లాయెను. అది కాలము అంతమయ్యే వరకు అనగా యేసుక్రీస్తు రెండవసారి వచ్చువరకు నిలిచియుం డును. అటు తరువాత కాలము ఇక ఉండకపోవును. ఏలయనగా మనలో ప్రతి వాడు తన నిత్య ఉనికిపట్టుకు పోవును.

గోత్రకర్తల కాలములో దైవారాధన, దైవసేవ అంతయును ఒక కుటుంబము ద్వారా జరిగెను. యూదుల యుగములో అది జాతీయము చేయబడెను. ఇశ్రాయేలు ప్రత్యేకముగా ఏర్పరచబడిన జనాంగ ముగా దేవుని సేవించెను. అయితే క్రీస్తు శకములో దైవారాధన అంతర్జాతీయ మయ్యెను. సర్వలోకమందున్న సర్వ మానవులు ఆయన నిప్పుడు ఆరాధించు తరుణము కలిగియున్నారు. అందు వలనే గోత్రకర్తల యుగమును మనము నక్షత్ర కాంతివలెను, యూదుల యుగము ను చంద్రకాంతివలెను, క్రీస్తుయుగమును సూర్యకాంతివలెను అలంకారరీతిగ పోల్చి చెప్పుకొనవచ్చును.

బైబిలు గ్రంధము ఈ మూడు ప్రత్యేక యుగములను గూర్చి బోధించు చున్నది. ఈ మూడు కాలములలో దేవుని చిత్తము వేర్వేరుగ యున్నదని అనేకులు గ్రహించలేక పోవుట వలన క్రైస్తవలోక మీనాడు బహు గలిబిలిగా తయారైనది. ఈ మూడు కాల ములలోను దేవుడు తన చిత్తములో మార్పు లను కల్పించినా ఆయన మాత్రము ఎన్నడు మార్పులేని వాడు. అందు వలన సత్యవాక్య మయిన బైబిలు గ్రంధ మును మనము సరిగ విభజించుచు మనయెడల దేవుని చిత్తమును విపులముగ తెలుసుకొను బాధ్యత మనదే అయియున్నది.

❋ ❋ ❋

క్రీస్తు సంఘములు సమర్పించు 'సత్యవాణి' టి.వి. కార్యక్రమమును ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 వరకు తేజ ఛానల్‌లో చూడండి. మీ బంధుమిత్రులతో కలిసి సువార్తను వినండి.

ఉపమానమాలిక :

# ధనవంతుడు - లాజరు

(RICH MAN AND LAZARUS)

లూకా *16:19-31*

దేవుడను గ్రహించిన సంపదను దుర్వినియోగము చేసినట్టి ఒక మనుష్యుని గూర్చి యేసు చెప్పిన కథనము లూకా సువార్త 16:19-31లో మనము చదువ గలము. ఇదొక ఉపమానము కాదుగాని యధార్ధ సంఘనటయే యని కొందరు చెబుతారు. అది యధార్ధ సంఘటన కావచ్చును, లేదా ఉపమానము కావచ్చును. ఏదైనను యేసు చెప్పిన పాఠము మాత్రము గొప్పది.

"ధనవంతుడు డొకడుండెను. అతడు ఊదా రంగు బట్టలను సన్నపు నార వస్త్రములును ధరించుకొని ప్రతి దినము బహుగా సుఖపడు చుండువాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. వాడు కురుపులతో నిండినవాడై ధనవంతుని యింటి వాకిట పడియుండి అతని బల్ల మీద నుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొన గోరెను; అంతేకాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతలచేత అబ్రాహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరము నుండి అబ్రాహామును అతని రొమ్మున ఆనుకొనియున్న లాజరునుచూచి తండ్రివైన అబ్రాహామా, నాయందు కనికరపడి తన వ్రేలికొనను నీళ్లలో ముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము; నేను ఈ అగ్ని జ్వాలలలో యాతన పడుచున్నానని కేకలు వేసి చెప్పెను. అందుకు అబ్రాహాము, కుమారుడా, నీవు నీ జీవిత కాలమందు నీ కిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము; ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందు చున్నాడు, నీవు యాతన పడుచున్నావు. అంతేకాక ఇక్కడ నుండి మీ యొద్దకు దాటగోరువాడు దాటిపోజాలకుండు నట్లును, అక్కడి వారు మా యొద్దకు దాటి రాజాల కుండునట్లును, మాకును మీకును మధ్య మహా అగాధ ముంచబడి యున్నదని చెప్పెను. అప్పుడతడు - తండ్రీ ఆలాగైతే నాకయిదుగురు

సహోదరులున్నారు. వారును ఈ వేదన కరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్య మిచ్చుటకై నా తండ్రి యింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నా ననెను. అందుకు అబ్రాహాము వారి యొద్ద మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనితో చెప్పగా, అతడు తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారి యొద్దకు వెళ్లిన యెడల వారు మారు మనస్సు పొందుదురని చెప్పెను. అందు కతడు, మోషేయు ప్రవక్తలును చెప్పిన మాటలు వారు విననియెడల మృతుల లోనుండి ఒకడు లేచిననువారు నమ్మరని అతనితో చెప్పెను".

యేసు ప్రభువు వర్ణించిన ఈ సంఘ టనలో ఇద్దరు మనుష్యులు, భూమిమీద వారు జీవించిన విధానము, చనిపోయిన తరువాత వారు చేరుకొనిన నిత్యస్థాన ములు, వారి నిత్య జీవిత పరిస్థితి మనకు తెలియజేయబడింది.

ధనవంతుడు సిరిసంపదలతో తుల తూగుచుండెను. అతడు సన్నపు నార వస్త్రములు, ఊదారంగు బట్టలు ధరించు కొనేవాడు. మరియు ప్రతిదినము తిని త్రాగి సుఖించేవాడు. అయితే లాజరు అనే దరిద్రుడు అన్న వస్త్రములు లేక బాధపడు చుండేవాడు. అతడు ధనవంతుని యింటి వాకిటయుండి అతని బల్ల మీదనుండి పడే రొట్టెముక్కల వలన ఆకలి తీర్చుకొన గోరే వాడు. మరియు అతడు కురుపులతో నిండినవాడై యున్నందున కుక్కలువచ్చి అతని కురుపులు నాకెను. వీరిద్దరు భూమి మీద బ్రదికి యున్నప్పటి స్థితియిది.

కాని దరిద్రుడైన లాజరు చని పోయాడు. దారిద్ర్యము వలన ధనవంతుని కంటె ముందు యితడు చనిపోయాడు. బహుశ అతని చావును ఎవరు గమనించి యుండలేదు. గాని అతడు చనిపోయి దేవదూతలచేత అబ్రాహాము రొమ్మున అను కొనుటకు కొనిపోబడెను. భూమిమీద ఉన్న ప్పుడతడు శ్రమననుభవించాడు గాని, చని పోయిన తరువాత అబ్రాహాము రొమ్మున సుఖాన్నను భవించుచున్నాడు.

ధనవంతుడు కూడ చనిపోయి పాతి పెట్టబడ్డాడు. దరిద్రులేమి, ధనవంతులేమి అందరు మరణించుట తథ్యము. "మనుష్యు లొక్కసారే మృతిపొందవలెనని నియమిం పబడెను; ఆ తరువాత తీర్పు జరు గును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (హెబ్రీ 9:27). ధనవంతులైనంత మాత్రాన వారు మరణాన్ని తప్పించుకోలేరు. ధనవం

తుడు చనిపోయినప్పుడు బహుశ గొప్ప ఆడంబరముతో అతడు పాతిపెట్టబడి యుండవచ్చును. అతడు చనిపోగా ఒక గొప్ప మానవుని కోల్పోయామని వివిధ నాయకులు ప్రకటనలుచేసి యుండ వచ్చును. గాని అతడు చనిపోయి పాతాళ ములో బాధపడు చుండెను. మృతుల లోకంలో అవినీతిపరులు, దుర్మార్గులు, అవిధేయులు మొదలగువారు యాతన పడు ప్రదేశమున కతడు కొని పోబడ్డాడు.

అతడు కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున అనుకొని యున్న లాజరును చూచాడు. ఇప్పుడతడు అవసరంలో యున్నాడుగనుక లాజరును చూస్తున్నాడు. భూమి మీద లాజరు అవస రంలో యున్నప్పుడు మాత్రం అతన్ని అతడు చూడలేకపోయాడు. ఇప్పుడతడు బీదవాడయ్యాడుగాని లాజరు సుఖాన్నను భవించుచున్నాడు.

అతడు, తండ్రివైన అబ్రాహామా యని అబ్రాహామును పిలుచుచున్నాడు. నేనొక మంచి యూదుడనుగనుక నా యందు కనికరం చూపుమని యడు గుచున్నాడు. "మారు మనస్సుకు తగిన ఫలము ఫలించుడి; అబ్రాహాము మాకు తండ్రి యని మీలో మీరు చెప్పుకోవ ద్దని" యేసు ప్రభువు బోధించారు (మత్త యి 3:8,9). అబ్రాహామును తండ్రియని పిలిచినంత మాత్రాన అతడు పడుయాతన నుండి తప్పించుకోలేడు. అనేకులు ప్రభువా, ప్రభువా అని ప్రార్ధనలు చేస్తారు. ప్రజలకు వినబడేలాగ కేకలు వేసి మరి ఆడంబరము చేస్తారు. గాని "నేను చెప్పుమాటల ప్రకారము మీరు చేయక - ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని ప్రభువడుగు చున్నారు (లూకా 6:46). ఈ భూమి మీద మీ యిష్టం వచ్చినట్లు జీవించి, ఆ తీర్పు నాడు ప్రభువా కనికరించుమని అడిగితే పనికిరాదు. తండ్రివైన అబ్రాహామా, నా యందు కనికరపడి తన వ్రేలికొనను నీళ్లలో ముంచి, నానాలుకను చల్లార్చుటకు లాజరు ను పంపుము; నేను ఈ అగ్ని జ్వాలలలో యాతనపడుచున్నానని ఆ ధనవంతుడు పాతాళము నుండి భిక్షమడు గుచున్నాడు. అక్కడివారిక్కడకు, ఇక్కడివారక్కడకు రాకుండునట్లు ఒక గొప్ప అగాధ ముంచబడి నదని అబ్రాహాము అతనికి చెప్పాడు.

మానవుడు జీవించియున్నప్పుడే నిత్య జీవితాన్ని పొందుటకుగాను జీవించాలి. చనిపోయిన తరువాత ఎవడు ఎవని గతిని మార్చలేడు. దేవుని మరచి దేవుడిచ్చిన సిరిసంపదలనే నమ్ముకొనుట కంటె గొప్ప పొరబాటు ఇంకొకటి యుండదు. ధనాశ,

దురాశ, లోభత్వము ఆత్మకు హాని కలుగ జేస్తాయి. ఈ ధనవంతుడు, ధనవంతుడైనందున నాశనమునకు పోలేదు గాని అతడు స్వార్ధపరుడును, భక్తిహీనుడైనందుకు పాతాళములో యాతన పడుచున్నాడు. లాజరు దరిద్రుడైనందుకు గాక అతడు దైవ భయము కలిగి దీన జీవితాన్ని జీవించినందుకు రక్షింపబడ్డాడు. మనము నిత్యత్వానికి సిద్ధపడే సమయం యిదే. ఇదిగో యిదే అనుకూల సమయం, ఇదే రక్షణదినం (2 కొరింధి 6:2). అద్భుతములు గాక, దేవుని వాక్యమే మనలను పరలోకానికి సిద్ధ పరచగలదు. దేవుని వాక్యాన్ని నమ్మని వాడు, మృతులలో నుండి ఒకడు లేచినను నమ్మడు.

✍ - జాషువా గూటం

* * *

# ఆకలి గొని యుండుడి

(STAY HUNGRY)

<u>లూకా 6:21</u>

*సంక్షిప్త ప్రసంగం :*

పరిచయం :

I. "ఇప్పుడు ఆకలిగొను చున్న మీరు ధన్యులు" అని యేసు చెప్పెను (లూకా 6:21).

నేటికాలంలో ఆకలిగొని యుండుట ధన్యకరమనడం ఆశ్చర్యంగానే యుంటాది.

నిజానికి అనేకులు ఆకలిగొని యున్నవారున్నారు.

నేటికిని, రేపటికిని కడుపునిండా తినడానికి తిండి యుంటే అదే గొప్ప ధన్యతయని అనేకులు భావిస్తారు.

II. అయితే మన ఆకలి మనల్ని పైకెత్తవచ్చు లేదా కృంగా దీయవచ్చని యేసు బోధించారు.

ఈ లోకంలో ఏయే సంగతుల విషయం ఆకలిగొని యున్నామో, దానిని బట్టి రాబోవు లోకంలో దేనితో నింపబడి యుంటామో గ్రహించుకోవచ్చును.

కాని సంగతుల విషయమై ప్రాకులాడుట మానవాళికున్న గొప్ప సమస్య.

హవ్వ నిషేధింపబడిన ఫలము కొరకు ఆకలిగొన్నది, అది ఆమె కొక శాపమయ్యింది.

ఏశావు కలగూర వంటకము కొరకు ఆకలిగొనెను. తత్ఫలితముగా అతని జ్యేష్ఠత్వమును కోల్పోయెను (ఆది.కా. 25:28-34).

దావీదు వేరొకని భార్య కొరకు ఆకలి గొనెను. అయితే గొప్ప, సిగ్గుతో, వేదనతో, పశ్చాత్తాపముతో జీవితం గడపవలసి వచ్చెను.

అయితే సరియైన ఆకలి కూడ కలదు. మనం వేటి కొరకు ఆకలి గొనాలో బైబిలు బోధించు సంగతులను గమనిం చుము:

III. దేవుని కొరకు ఆకలి గొనాలి :

దేవుడు మాత్రమే తీర్చగల ఆకలిని ఆయన మనలో ప్రతివానిలో ఉంచెను (కీర్తన 42:1-2; 34:8-9).

మన సృష్టికర్తతో సహవాసము కలిగి యుండే గొప్ప ఆవశ్యకత మనం కలిగి యున్నాము.

అనేకులు ఈ ఆకలి విషయం గజి బిజిగా యున్నారు. దాన్ని గుర్తించలేక యున్నారు.

అందువలన అదీ, యిదీ చేయమొద లిడుదురు. ఆత్మీయాకలి తీరక యుం దురు.

దేవుడు మనల్ని సృజించారు. ఆయన్ను కనుగొనే వరకు ఆయనను గూర్చిన ఆకలి తీరదు.

IV. సత్యము కొరకు ఆకలి :

సత్యము మనలను స్వతంత్రులనుగా చేయునని యేసు చెప్పెను (యోహాను 8:32).

బయలు పరచబడిన సత్యమును గూర్చిన ఆకలి కోల్పోవుటయే నేడున్న గొప్ప ఆత్మీయ సమస్యయై యున్నది. అందు వలననే బైబిలు స్టడీ యెడల ప్రజలకు నిర్లక్ష్యం. దేవుని వాక్యాన్ని గూర్చిన ఆకలి స్వల్పమే (1 పేతురు 2:2-3).

అనేకులు బైబిలు స్టడీని గైర్హాజరవు తారు. ఎంతో విచారం! (హెబ్రీ 10:24-25; 2 తిమో 2:15).

V. నీతి కొరకు ఆకలి :

"నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురని" యేసు చెప్పెను (మత్తయి 5:6).

మనుష్యుడు రొట్టెవలన మాత్రమే జీవించడు (లూకా 4:4). నీతి కొరకు పరిశుద్ధమైన ఉన్నతమైన ఆకలి తప్పక యుండాలి.

నీతయనగా, నీతిని జరిగించుట doing right, సరియైన క్రియలు జరిగిం చుట (I యోహాను 3:7).

నీతి యనగా నీతి కలిగి జీవించుట కూడాను. దేవునితో సరియైన సంబంధము కలిగి యుండుట (ఎఫెసీ 2:11-16).

మనం నీతి కలిగి యుండాలి, నీతిని జరిగించాలి.

## VI. పరలోకం కొరకు ఆకలి :

*హెబ్రీ 11:8-16 చదువుము*

దేవుని పట్టణం కొరకు ఆకలి గొన్న వారి యొక్క ఛాయచిత్రము మనకు ఇక్కడ లభించును.

ఈలోకం మనదికాదు; ఇక్కడ యాత్రికులమే.

విచారం యేమంటే అనేకులు ఇక్కడే నిత్యము ఉంటామనే తలంపుతో జీవించుచున్నారు. ఈ లోకంతో వారి జీవితాలు నిండి యున్నాయి.

అయితే దేవుని ప్రజలు ఈ లోకంలో సంతృప్తి జెందలేరు.

దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణం కొరకు వారికి ఆకలియున్నది (2 కొరింధీ 5:1-4).

మనం ఆత్మీయాకలి గొని యున్నంత కాలము ఆత్మీయాభివృద్ధి సాధ్యమవుతాది.

మన ఆకలిని బట్టి మన జీవితం, గమ్యం నిర్ణయించబడతాది.

మనం దేన్ని గూర్చి ఆకలి గొంటామో దాన్ని బట్టి మనం యేమిటో నిర్ణయించ బడతాది.

గనుక "ఆకలిగొని యున్న మీరు ధన్యులు".

✍ - బాట డోక్రీ

❋ ❋ ❋

# యోగ్యముగా ఇచ్చుట

(GIVING WORTHILY)

సార్దిస్‌లో యున్న కొందరు పరిశుద్ధులు తెల్లని వస్త్రములు ధరించుకొని క్రీస్తుతో కూడ నడుతురు ఏలయనగా వారు అర్హులు (ప్రక 3:4). ప్రభువుకు మనం యేమిచేసినా దాన్ని యోగ్యముగా చేయాలి (1 కొరింధీ 11:27). మన పిలుపునకు తగినట్టుగా మనం నడుచుకోవాలి (ఎఫెసీ 4:1). భౌతిక సంబంధమైన ఆశీర్వాదములలో కొంత భాగాన్ని తిరిగి దేవునికి యిచ్చుటలో యిది మరి ముఖ్యం. దీనిని అతిముఖ్యమైనదిగా మనం ఎంచాలి. యేసు ప్రభువు చెప్పిన అనేక ఉపమానాలలో

ఆయన ఇచ్చుటను గూర్చి వక్కాణిం చారు. అవినీతి పరుడైన గృహ నిర్వాహకుడు, ధనవంతుడు లాజరు, బుద్ధిహీనుడైన ధనంతుడు మొదలగు ప్రభువు చెప్పిన ఉపమానములు, అపొస్తలులు చేసిన బోధలు దేవుడు మనకిచ్చిన ధనాన్ని సద్వినియోగం చేయాలనే బాధ్యతను మనకు నేర్పు చున్నవి.

2 కొరింధీ 8:1-5లో మనం యోగ్యముగా ఎందుకు ఇయ్యాలో అయిదు కారణములను పౌలు తెలియ జేయు చున్నాడు. అవి మొదటి శతాబ్దములో ఎంత ముఖ్యమో ఈ 21వ శతాబ్దము లోను అంతే ముఖ్యము. మనం లోభత్వమునకు తావీయకుండుట మనకు మంచిది. లోబి, లోభత్వము అను మాటలు మంచివికావు. అవి అక్రమ ధనార్జనను, దురాశను సూచించు మాటలు. దురాశ వలన ఒకడు నింపబడి దొంగతనమునకు, అబద్ధమాడుటకు, వ్యభిచరించుటకు, చివరకు నరహత్యకు నడిపించబడును. క్రీస్తు ద్వారా దేవుని కృప లేకపోతే మనం దురాశకు లోనై పోయే వారమే.

ఒకడు విశాల హృదయుడై ధారాళంగా ఇచ్చువాడగునట్లు క్రీస్తు మార్గము నడిపించును. తనకు కలిగిన దానిని బీదలకును అనాధలకును ఇచ్చుటలో అతడు సంతోషించును. మనకు మనమే సంతోషంగా యుండాలంటే స్వార్ధపరులమవుదుము. గాని మనకున్న దానిని యితరులతో పంచుకొనినప్పుడు ప్రేమ, సంతోషముల ధికములగును. అట్లుండకపోతే మనం స్వార్ధపరులము, లోభులమగుదుము. అశాంతి మనదగును.

1. యితరుల మాదిరిని బట్టి మనం **యోగ్యంగా ఇయ్యాలని పౌలు చెబుతున్నాడు:** మాసిదోనియలోని పరిశుద్ధుల మాదిరిని చూపిస్తు అకయలోనున్న వారిని పౌలు పురికొల్పు చున్నాడు. వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను. "పేదలే పేదలకు సహాయం చేతురని" ఒకాయన అన్నారు. అంటే బీదతనం యేమిటో వారెరుగుదురు గనుక వారు ఒండొరులకు సహాయపడ్డారు. బీదలు, సామాన్య ప్రజలే యేసు ప్రభువును ఎక్కువ వెంబడించారు. ధనవంతులైన వారిలో ఎక్కువ మంది ఆయనను తిరస్కరించారు. "లోకరీతిని జ్ఞానులైనను ఘనులైనను గొప్పవంశమువారైనను అనేకులు పిలువబడలేదనుట" నిజమే (1 కొరింధీ 1:26).

ధనాన్ని మనం ఉపయోగించే విధానమునుబట్టి అది మేలైన చేయగలదు, కీడైనా చేయగలదు, ధనం కలిగి యుండుట తప్పు కాదు. దాన్ని యితరులతో పంచుకొన

పోవడం తప్పు! లూకా 10:25-27లో మంచి సమరయుని గమనించుము. దొంగల బారిన పడిన వానికి సహాయ పడుటకతడు తనధనాన్ని వినియోగించాడు. దేవుడు తమకిచ్చిన ధనమును సంఘసహాయార్ధం కొందరు వినియోగించుట నీవు చూచునప్పుడు, నీవు కూడ వారి మాదిరి ననుసరింప గలవు. పౌలుకు ఈ సంగతి తెలుసు. అందుకనే కొరింధీయులను పురికొల్పడానికి మాసిదొనియ వారిని ఉదాహరణగా అతడు వినియోగించాడు.

2. **"మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు కృపను ఎరుగుదురుగదా!** ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింధి 8:9). ఇచ్చుట భూమి మీద కాదు గాని పరలోకంలో ఆరంభమయ్యింది. "దేవుడులోకమునెంతో ప్రేమించి.......తన అద్వితీయ కుమారుని అనుగ్రహించెను (యోహాను 3:16). ఆయన యిచ్చిన బహుమానం యేమిటి? ఆయన ఏకైక కుమారుడు!! యేసు తనకు తానే తన ప్రాణమును పెట్టెను (యోహాను 10:18). కావలెనంటే ఆయన 12 సేనావ్యూహములను పరలోకము నుండి రప్పించి తన్ను తాను రక్షించుకొనవచ్చును (మత్తయి 26:53). గాని ఆయన నశించిన శిధిలమై పోయిన మానవుని ప్రేమించారు. అట్టి వానిని రక్షించే దేవుని మార్గము ఆయన ఒక్కడే అని ఆయన ఎరుగును (రోమా 5:8). మన ప్రభువు యొక్క ఆశ్చర్యకరమైన దాతృత్వము ఉదారత మనం యోగ్యముగా ఇచ్చుటలో అగ్రస్థానము చేరుకొనునట్లు మనలను పురికొల్పాలి. సంఘము నొచ్చికొనునంత తమమట్టుకు ఇయ్యడం నేర్చుకొంటేనే గాని లోకంలో నశించిన వారికి సువార్తను అందియ్యలేదు. మనం నొప్పికలిగేటంత వరకు ఇస్తుయుంటే కొంతకాలానికి అది నొప్పి అనిపించదు ఏలయనగా అప్పటికి ధారాళంగా ఇయ్యడం నేర్చుకొని యుంటాము.

సువార్తికులను దూర ప్రాంతముకు పంపడానికి, సువార్త కూటములు జరిపించడానికి వాక్యాన్ని ప్రకటించడానికి డబ్బు అవుసరం. యేసు యొక్క ప్రేమ కధ నలుమూ లలా చాటించబడాలి. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి గొప్ప ఆలయములు నిర్మించుకొని వాటిలో మిషనెరీలకు, సువార్తికులకు స్థానం కల్పించని సంఘములు మృతి జెందుచున్నట్టివే. ఆలయములు నిర్మించుటలో తప్పులేదుగాని వాటిని నిర్మించుటలో సంఘము యొక్క అసలైన పనిని, అనగా ఆత్మల రక్షణను మరచితే వాటి ప్రయోజనం శూన్యం. మనం దేవుని

పనికి ఇయ్యాలి. త్యాగ పూరితముగా ఇయ్యాలి.

3. కొరింథులోని సంఘము యొక్క గతచరిత్రను విని యోగిస్తు వారు నమ్మకముగా యోగ్యముగా ఇయ్యాలని పౌలు హెచ్చరించాడు. వారు సంవత్సరము క్రిందటనే ఈ కార్యము చేయుట యందే గాక చేయ తలపెట్టుడ యందును కూడ మొదటివారై యుండాలని పౌలు వారిని హెచ్చరించాడు (2 కొరింథీ 8:10). వారు మొదలు పెట్టిన దానిని ముగించడం అత్యవసరం. మనం అనేక మంచి సంగతులను మొదలుపెట్టి ముగించం గనుక విఫలమవుతాయి. "నీ శ్రేష్టమైన స్థాయికి దిగువ జారిపోను" అను మాట జ్ఞాపకం ఉంచుకోవాలి. గతంలో సాధించిన గొప్ప వాటిపై ఆనుకొని విశ్రాంతి బొందుట మంచిదికాదు. గతంలో సాధించిన గొప్ప కార్యములను ప్రస్తుతపు అశ్రద్ధ కనబడకుండా చేస్తాది.

4. సత్కార్యములను క్రమరూపకం చేయడం ఉత్తమము. మంచి కార్యము తలపెట్టుటకు వారికున్న సిద్ధమైన మనస్సును బట్టి పౌలు వారిని అభినందించాడు (2 కొరింథీ 8:11). మన శక్తి సామర్థ్యములను బట్టి, తరుణములను బట్టి దేవుడు మనకు తీర్పు తీర్చును, ఏలయనగా "శక్తికి మించి కాదుగాని కలిమి కొలదియే యిచ్చిన ప్రీతికరము" (2 కొరింథీ 8:12). ఎవరు తమ విశ్వాసాన్ని బట్టి జీవిస్తారో వారే మంచి బోధకులు. మంచి కార్యరూపం ధరిస్తే అదే అందరికి అవసరం.

5. జీవితం సంగతులను చదును చేస్తాది. అన్యజనులు యూదులకు ఇప్పుడు భౌతికంగా సహాయం చేయుచున్నారు. యూదులకు మొదట సువార్త అందియ్యబడింది. దాన్ని వారు అన్యులతో పంచుకొన్నారు. యూరోపియన్ గ్రీసు దేశంలోని అన్యులు సంపన్నపరులు గాని యూదులు కరువు నెదుర్కొను చున్నారు. అనేకులు యూదామతాన్ని విడిచి పెట్టి క్రీస్తును అంగీకరించి నందున హింసింప బడుచుండిరి. ఇప్పుడు ఇరువురు సమానముగా కనబడుచున్నారు. "హెచ్చుగా కూర్చుకొనిన వానికి ఎక్కువ మిగల లేదనియు తక్కువగా కూర్చుకొనిన వానికి తక్కువ కాలేదనియు వ్రాయబడిన ప్రకారము అందరికి సమానముగా ఉండు నిమిత్తము ప్రస్తుతమందు మీ సమృద్ధి వారి అక్కరకును మరి యొకప్పుడు వారి సమృద్ధి మీ యక్కరకును సహాయమై యుండవలెను" (2 కొరింథీ 8:14-15).

"నీ ఆహారము నీళ్ల మీద వేయుము, చాల దినములైన తరువాత అది నీకు కనబడును" (ప్రసంగి 11:1). యేసు లూకా

6:38లో చెప్పిన మాటలను సొలొమోను తన శైలిలో చెప్పినట్లున్నది. "క్షమించండి అప్పుడు క్షమింపబడుదురు; ఇయ్యుడి అప్పుడు మీకు ఇయ్యబడును; అణచి కుదిలించి దిగజారు నట్లు నిండు కొలత తో మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలుత తోనే మీకు మరల కొలువ బడును".

ఇచ్చుటలో ఒకడు ఎన్నడు పేదవాడై పోడు, ఏలయనగా మనుష్యుడేమి విత్తునో దానినే కోయును. దేవుని మహోచితమైన కృప వలన మానవుడు అత్యధికముగా ఆశీర్వ దించ బడ్డాడు (కీర్త 37:25; రోమా 8:28; గలతీ 6:7).

✍ - బిల్ నిక్స్

❋ ❋ ❋

# ఏలీ కుమారుల నుండి పాఠములు

(LESSONS FROM THE SONS OF ELI)

ఇశ్రాయేలీయుల 15 మంది న్యాయాధిపతులలో ఏలీ 14వ వాడు. 1 సమూయేలు గ్రంథము 2, 3 అధ్యాయములు ఏలీ కుమారుల తత్వాన్ని మనకు బయలు పరచును. వారు 'బెలియాలు' కుమారులని అంటే పనికి మాలిన వారని చెప్పబడినది. వారు ఎందుకు పనికి మాలిన వారయ్యారో కనీసం మూడు కారణాలియ్యబడినవి. తత్ఫలితముగా వారి క్రియలు ఖండింప తగినవాయెను.

**మొదటిగా, ఏలీకుమారులు యెహోవాను ఎరుగని వారు (1 సమూ 2:12).** ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించు కొనని వాడు ఆయన చిత్తము నెరుగడు దాని ప్రకారము చేయడు (యోహాను 7:17). దేవుని చిత్తమును నేర్పే బాధ్యత తలిదండ్రులదే (సామె 22:6). ఒకడు సత్యము నెరుగని యెడల అతడు స్వతంత్రుడెట్లు కాగలడు? (యోహాను 8:32). ఏలీ కుమారులు యెహోవాను ఎరుగని వారైరి గనుక ఘోర కృత్యములు జరిగించిరి.

**రెండవదిగా, ఏలీ కుమారులు దేవుని కర్పించు బలులను నిర్లక్ష్యపెట్టిరి (1 సమూ 2:13-17).** బైబిలులో దేవుని ఆరాధనను నిర్లక్ష్యంగా చేసినవారు లేకపోలేదు. ఆది కాండము 4 లో కయీను, లేవీ కాండము 10వ అధ్యాయములో నాదాబు అబీహులు ఈ జాబితాలోని వారే. దేవుని చిత్తము నెరుగక పోయినప్పుడు ప్రతివాడును తన

యిష్టాను సారముగా ప్రవర్తించును (న్యాయా 17:6).

**మూడవదిగా, ఏలీకుమారులు అవి నీతిపరులు (1 సమూ 2:22).** వారికి ఆశానిగ్రం అంటే యేమిటో తెలియ నట్లున్నది. వారు కామాతురత గలిగి దుష్కార్యములు చేసారు. వారు బహుశ విగ్రహారాధికులై యిట్టి నీచ కార్యములు చేసి యుండవచ్చును. వారు బహుశ పది యాజ్ఞలను పూర్తిగా మరచి యుండ వచ్చును. నేటి మనలోకము టెలివిజన్, చలనచిత్రము, ఆధునిక సంగీతము, అశ్లీల సాహిత్యము మొ॥గు వాటి వలన కలుషితం చేయబడి యున్నది. అందుకే "మోసపోకుడి, దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపునని" పౌలు హెచ్చరించాడు (1 కొరింధీ 15:33).

ఏలీ కుమారుల యొక్క అక్రమ ప్రవర్తనకు కారణమున్నది. అదేమనగా, "తన కుమారులు తమ్మును తాము శాపగ్రస్తు లగా చేసికొనుచున్నారని తానెరిగియు అతడు వారిని అడ్డగించలేదు" (1 సమూ 3:13). పిల్లలను పెంచే గురుతర బాధ్యత తలిదండ్రులదే, అంటే వారిని క్రమశిక్షణ లో యుంచాలి. వారికి కావలసినదెల్లా చేయరాదు, కావలసిన దల్లా ఇచ్చేయ నక్కర్లేదు. ప్రభువు యొక్క క్రమశిక్షణలో పిల్లలను పెంచుటలో విఫలమైనప్పుడు (ఎఫెసీ 6:4), దేవుని కంటే మనపిల్లలనే ఎక్కువ ఘనపరచు వారమగుదుము (1 సమూ 2:29). అంటే దేవుని యెడల అప నమ్మకము కలిగిన వారమవుదాము.

తలిదండ్రుల క్రమశిక్షణ నేడు అత్యవసరం. దుష్టత్వం జరిగించుటకు మనుష్యులు తొందర పడతారు (యిర్మి 17:9). ప్రపంచములో జరుగుచున్న అనేక దుష్కార్యములను గూర్చి వినడం, చూడడం వలన ఈ దౌష్ట్యము ఇంకా ఎక్కువగుచున్నది. అందువలన కుటుంబ క్రమశిక్షణ అత్యవసరం. అది దేవుని యెడలను, మన పిల్లల యెడలను మన బాధ్యత అయ్యున్నది. ద్వితీ 6:3-9; 21:1'-21; సామె 19:18, 23:13-14; 29:15-16; 22:6, ఎఫెసీ 6:4ను కూడ చూడండి. కుటుంబ క్రమశిక్షణ లేకపోతే తలిదండ్రులకు, పిల్లలకు, చివరకు దేశానికి నష్టమే (1 సమూ 4:11, 18, 22 లను చూడుము). తలిదండ్రులు బిడ్డలపై తగు క్రమశిక్షణను అమలు పర్చాలి. పిల్లలు కూడ తలిదండ్రులను గౌరవిస్తు వారికి లోబడాలి. తలిదండ్రులు పిల్లలను ప్రభువు యొక్క శిక్షణలోను బోధలోను పెంచితే అదే పిల్లలు తమ తలిదండ్రులను ఘన పరుస్తారు.

- మేక్స్ పేటర్సన్.

* * *

# క్రీస్తు సంఘ మనగా నేమి?

(WHAT IS THE CHURCH OF CHRIST)

మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని" (మత్త 16:13) యేసు తన శిష్యులను ప్రశ్నించినప్పుడు, పేతురు "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను". అందుకు యేసు పేతురును దీవించి "ఈ బండ మీద (అతడు గుర్తించిన దేవుని కుమారుడన క్రీస్తు అను బండమీద) నా సంఘమును కట్టుదును" అని చెప్పెను (మత్తయి 16:18).

క్రొత్త నిబంధన పరిశీలిస్తే క్రీస్తే సంఘమును స్థాపించెనని సత్యాన్వేషులు గ్రహించగలరు. అపొ॥కా॥ 2వ అధ్యాయములో మూడు వేల మంది బాప్తిస్మము పొంది సంఘముగా చేర్చబడినట్లు వ్రాయబడింది. (అపొ॥కా॥2:47). సంఘము అనగా దేవుని నియమము చొప్పున బైబిలు నందు ఉన్న సార్వత్రిక సంఘము అనే భావంతోను వ్రాయబడింది.

క్రీస్తు సంఘము ఆయన చేత స్థాపించబడి, ఆయనే శిరస్సుగా, రక్షకునిగా కలిగిన సంఘము. క్రొత్త నిబంధన ఆరంభ దినాల్లోనే అనేక ప్రాంతాలలో, అనేక నగరాల్లో క్రీస్తు సంఘము స్థాపించబడింది. అపొస్తలులు, అదిమ క్రైస్తవులు ఏ ప్రాంతానికి వెళ్ళినను వాక్యమును ప్రకటించిరి. (అపొ॥కా॥ 8:4, 13:49). ఎక్కడైతే ప్రజలు ఆయన వాక్యమును విశ్వసించి, విధేయులయ్యారో అక్కడ సంఘము ఏర్పడింది (అపొ॥కా॥ 4:21 ప్రక 1:11). స్థానిక సంఘములు వేరు వేరుగా ఆయా ప్రాంతాలలో ఉన్నప్పటికిని అన్నియు క్రీస్తు శరీరమై యున్నవి. ఆ కాలంలో దైవావేశము కలిగిన అపొస్తలులు, ప్రవక్తలు బోధించిరి. మరియు వారి కొరకు అపొస్తలులు వ్రాసిన పత్రికలు, గ్రంధములు పంపబడగా ఆ లేఖన భాగములను బట్టి అవి నడిపింపబడెను. ఈ పత్రికలన్నియు ఒక చోటికి చేర్చి క్రొత్త నిబంధన గ్రంధముగ మనము నేడు చదువుచున్నాము. భూమి మీద సంఘమునకు నేడు అధికార యుక్తమైన దేవుని వాక్యము ఇదే.

❋ ❋ ❋

# సత్యవాక్కు చదువరులకు విజ్ఞప్తి

Satya Vani - Church of Christ

7-9-35, Ramaraopet, Kakinada - 533 004.

Dear Friend,

క్రీస్తు నామమున మీకు శుభములు. సత్యవాణి సువార్త సేవా కార్యక్రమముల ద్వారా మీరు ఆత్మీయంగా బలపడుచున్నారనియే మా విశ్వాసము. బైబిలు కరస్పాండెన్సు కోర్సులో ఇప్పుడు లక్షలాది మంది చేరి దానిని పూర్తి చేసి ప్రతివారు బైబిలు గ్రంథమును ఉచితముగా పొందుచున్నారు. ఆలాగే మేము ముద్రించిన పుస్తకముల ద్వారా సత్యవాక్కు మాస పత్రిక ద్వారా లక్షలాది మంది సత్యమును తెలిసికొనుచున్నారు. అనేక మంది బాప్తిస్మము పొందుచున్నారు. రేడియో, టి.వి. కార్యక్రమాలు సత్యమును ప్రకటించుటలో గొప్ప సాధనములుగా వాడబడుచున్నవి. ఆత్మలను రక్షించే ఈ గొప్ప కార్యక్రమములో మీరు మాకు ప్రార్థన పూర్వకముగాను, ఆర్థికంగాను చేయూత నీయవలెనని మేము కోరుచున్నాము. ఆ విధముగా ప్రభువు మిమ్మును ప్రేరేపించిన యెడల మీ విరాళములను పై చిరునామాకు పంపించండి. డి.డి.లు, చెక్కులు "Satya Vani - Church of Christ" పేరున పంపించండి. దేవుడు మిమ్మును దీవించును గాక!

వందనములతో

Bro. జాషువా గూటం

'సత్యవాణి' రేడియో కార్యక్రమాలను ఆది, సోమ, బుధ వారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి.

మీ బంధు మిత్రులకు విజ్ఞాపించండి !!

# మనుష్యులు ఎక్కువ లోబడే ఆజ్ఞ

(THE MOST OBEYED COMMANDMENT)

లూకా 9:21లో మనుష్యులు ఎక్కువ లోబడే ఆజ్ఞ మనకు కన్పించును. అక్కడ పేతురు యేసే క్రీస్తని ఒప్పుకొనగా, "ఆయన ఇది ఎవరితోను చెప్పవద్దని వారికి ఖండితముగా ఆజ్ఞాపించెను". ఇక్కడ యేసు తానెవరో ఎవరితోను ఎందుకు చెప్పవద్దన్నారు? పేతురు చేసిన గొప్ప ఒప్పుకోలు అనంతరం యేసు ఎందు నిమిత్తము తన శిష్యులను అలాగ కోరారు? పేతురును, మిగతా శిష్యులును యేసు ఎవరో అప్పటికింకా పూర్తిగా ఎరుగనందున ఆయన అట్లు ఆజ్ఞా పించారని కొందరు నుకొంటారు. మత్తయి 16:22లో దీని తాలూకు కొంత రుజువున్నది. క్రీస్తు సిలువ మరణాన్ని అపార్ధము చేసికొన్నందున పేతురు అక్కడ గద్దించబడతాడు. క్రీస్తు వారు అన్ని విషయాలను సమయానికి జరిపించుచు వచ్చారు. అప్పటికి ఆయన సమయం ఇంకా పూర్తిగా రాలేదు.

సంఘములో నేడు ఆందోళన కరమైన నిశ్శబ్దం వున్నది. అనేకులు ఆరాధన స్థలాన్నుంచి బయల్వెడలిన తరువాత క్రీస్తును గూర్చి అసలు నోరు విప్పరు. ఆరాధనలో వారు పొందిన అనుభూతి తమదైనందిన జీవితాలలో కన్పరచరు. యితరులతో దాన్ని పంచుకోరు. దేవుని గూర్చి క్రీస్తును గూర్చి తమ ఇరుగు పొరుగు వారితోగాని, బిడ్డలతో గాని, లేదా యితరులతో గాని ఎన్నడు సంభాషించరు.

"ఎవనితోను చెప్పవద్దు" అన్న ఆజ్ఞకు మనుష్యులు ఈనాడు ఎందుకు లోబడుదురంటే దాని వలన వారు ఎవరితోను సంభాషించనక్కర్లేదు, ప్రశ్నలకు జవాబీయనక్కర్లేదు, ఎవరితోను వాదించ నక్కర్లేదు, విభేదించ నక్కర్లేదు. అనేకులు క్రీస్తును బట్టి తమ స్నేహాన్ని భగ్నం చేసుకోవాలనుకొనరు.

అయితే ఈ యాజ్ఞ అపొస్తలులకు తత్కాలమునకే ఇయ్యబడిన దని మనం గమనించాలి. అది కొంత కాలము మట్టుకే. మనమిప్పుడు క్రీస్తును గూర్చి చెప్పాలి, క్రీస్తును పంచుకోవాలి, ఆయన సువార్తను లోకమంతటా చాటించాలి. ఆదిమ సంఘము గొప్ప బోధకులు వలన మాత్రమే గాక సామాన్య సభ్యులు క్రీస్తును గూర్చి తమ పొరుగువారికి చెప్పుట వలన గొప్పగా అభివృద్ధి జెందెను. వారు నిశ్శబ్దంగా యుండలేక పోయిరి. వారు మేము కన్న వాటిని విన్న వాటికి చెప్పక యుండలేమనిరి (అపొ.కా. 4:20). ఆలాగే మనము కూడా!

✍ - బాబ్ ప్లంకెట్

❋ ❋ ❋

# ఒనేసిఫోరును ఎరుగుదువా?

(DO YOU KONW ONESIPHORUS?)

ఒనేసిఫోరు అనునదొక వింతపేరు! నేను ఎన్నడు వినలేని పేర్లు గలవారిని కొంతమందిని కలిసాను. గాని యిది అందులో ఒకటి కాదు. అయితే నీవతనిని గూర్చి తెలిసికోవాలి. 2తిమోతి 1:16-18లో పౌలు తిమోతికి అతని గూర్చి వ్రాసాడు: "ప్రభువు ఒనేసిఫోరు ఇంటివారి యందు కనికరము చూపునుగాక. అతడు రోమాకు వచ్చినప్పుడు నా సంకెళ్లను గూర్చి సిగ్గుపడక శ్రద్ధగా నన్నువెదకి కనుగొని అనేక పర్యాయములు ఆదరించెను. మరియు అతడు ఎఫెసులో ఎంతగా ఉపచారము చేసెనో అది నీవు బాగుగా ఎరుగుదువు. ఆ దినమందు అతడు ప్రభువు వలన కనికరము పొందునట్లు ప్రభువు అనుగ్రహించును గాక".

మొదటి శతాబ్దపు క్రైస్తవులను గూర్చి తెలిసికొనగోరినచో ఒనేసిఫోరును గూర్చి వ్రాయబడిన దంతా ఇంతే! గాని ఎంతగొప్ప మాదిరియో! అతన్ని గూర్చి పెద్దగా తెలియజేయబడలేదు. గాని అతన్ని గూర్చి చెప్పబడినవి అనుకరించదగినవి.

యితరులు అటుయిటు పోవుచుండగా అతడు దైవజనుడైన పౌలు చెంత నిలిచాడు. దాన్నతడు ఎట్లు చేసాడో నాకు తెలీదు. చెరసాలలో అతడు పౌలు కొరకు ఉతికిన దుస్తులు, భోజనం తెస్తూ యుండేవాడని పిస్తాది. అదే సందర్భంలో వారిద్దరు కూర్చొని సరదాగా ముచ్చట్లాడుకొనుచున్నట్లు కూడా ఊహించుకోగలం.

పౌలుకు వేయబడిన సంకెళ్లను ఒనేసిఫోరు లెక్క చేసినట్లు కనబడదు. కొందరైతే వాటిని గూర్చి సిగ్గుపడ్డారు. "నేను సంకెళ్లను చూడలేను" అను కొంటూ కొందరు సహోదరులు వెనుదిరిగారు. గాని ఒనేసిఫోరు వచ్చేవాడు. యితరులు దూరము నుండి ప్రార్థించడానికి ఎంచుకొంటే అతడు ప్రేమ, దయకనబరచాడు.

నేటి సంఘములో ఒనేసిఫోరు లాంటి వారనేకులున్నారు. లోకం వారినెరుగదు, గుర్తించదు. గాని యితరులు తప్పించుకొంటూవుంటే, వారు పరిచర్య చేస్తూనే వుంటారు. తీర్పు దినమందు ప్రభువు వారి యెడల తప్పక కనికరము చూపును. అట్టి వారిలో నీ వొకడవా?

✍ - లియోన్ టార్స్

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 30/- లు- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# ప్రసంగములు ప్రసారించబడుచున్నవి

## సత్యవాణి

## టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వినిపించండి !!!

# "సత్యవాక్కు"

సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా అనేక వేల గృహములను దర్శించు చున్నది. మరియు అనేక మంది ప్రతినెలా మాసపత్రికను కోరుచున్నారు. అట్టివారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా పంపించ వలెను. లేనియెడల సత్యవాక్కు పత్రిక పంపబడదు. మీకు సత్యవాక్కు క్రమముగా అందుచున్న యెడల మీ చందాను వెంటనే పంపండి. సత్యవాక్కు పత్రిక కాపీలు ఒకటికంటె ఎక్కువ మీకు అందుచున్న యెడల వాటి వివరాలు మాకు తెలియజేయండి.

\- 'ఎడిటర్'

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.